క్లుప్తంగా

ఒక్క రోజు ముచ్చటేనా?



అరణ్యంకండ్రిగ విలేజ్ క్లినిక్

నారాయణవనం: పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందివ్వడం కోసం లక్షల రూపాయలతో నిర్మించిన విలేజ్ క్లినిక్ ఒక్క రోజు ముచ్చటగా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో మెరుగైన 104 రకాల మెరుగైన వద్య పరీక్షలు, సేవలతో విలేజ్ క్లినిక్‌లను అప్పటి సీఎం జగన్ ప్రారంభించారు. మండలంలోని అరణ్యకండ్రిగ పంచాయతీలో పూర్తయిన విలేజ్ క్లినిక్ 20 నెలల తర్వాత ఈనెల 5న సోమవారం డీఎంహెచ్‌వో నేతృత్వంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ప్రారంభమైన రోజున మాత్రమే తెరచుకున్న క్లినిక్ ఆ తర్వాత తెరుచుకోలేదు. విలేజ్ క్లినిక్ ఒక్క రోజు ముచ్చటేనా? అంటూ పంచాయతీ వాసులు చర్చించుకుంటున్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా వెంకటరామిరెడ్డి



సత్యవేడు ప్రిన్సిపల్‌ను అభినందిస్తున్న లెక్చరర్లు

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా వెంకటరామిరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపల్ మార్చిలో మృతి చెందారు. కడప బాలుర జూనియర్ కళాశాలలో సంస్కృత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటరామిరెడ్డి ఉద్యోగోన్నతిపై ఇక్కడ ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపల్‌ను కళాశాల అధ్యాపకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్‌గా హర్షవర్ధన్



సత్యవేడు: మండలంలోని దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ హర్షవర్ధన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్లు గుణశేఖర్, మురళీకృష్ణ ఉన్నత చదువుల కోసం వెళ్లడంతో వైద్యుల పోస్టులు ఖాళీ అయ్యాయి. ఈ క్రమంలో హర్షవర్ధన్ ఇక్కడ నియమితులయ్యారు.

శ్రీసిటీలో 320 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న పరిశ్రమల సిబ్బంది

శ్రీసిటీ(సత్యవేడు): భారత సైనిక దళాలకు సంఘీభావంగా బుధవారం శ్రీసిటీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీసిటీ ఫౌండేషన్, తిరుపతి ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి ప్రారంభించారు. సుమారు 320 మంది రక్తదానం చేశారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్ (కమర్షియల్ రిలేషన్) రమేష్ కుమార్, సెక్యూరిటీ హెడ్ వై.రమేష్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్, ఎన్టీఆర్ ట్రస్టు పీఆర్‌ఓ రవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

24 కేజీల గంజాయి పట్టివేత

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంటలో బుధవారం సాయంత్రం పోలీసుల చేపట్టిన తనిఖీల్లో 24 కేజీల గంజాయి పట్టుబడింది. ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వివరాలను గురువారం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ముక్కంటి సేవలో..

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం తాడేపల్లి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం పలికారు. అధికారులు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎమ్మెల్యే సారూ.. ఇటు చూడండి మీరు..!



- నేడు మండల సర్వ సభ్యసమావేశం
- గత సమావేశాల్లోను ప్రజా సమస్యలను పట్టించుకోని సభ్యులు



బుచ్చినాయుడుకండ్రిగలో చెత్తతో నిండిపోయిన శ్మశానం, అధ్వాన్నంగా ఉన్న జంబుగోళం రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి అధ్యక్షతన గురువారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్య అతిథిగా విచ్చేస్తారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు. గత సమావేశాల్లోనూ ప్రజల సమస్యలను పట్టించుకోకుండా టీ తాగి, బిస్కట్ తిని వెళ్లిపోయారు. గ్రామాల్లో తిష్టవేసిన సమస్యలతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి11 నెలలైనా మండలంలో ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదు. మూడు మండల సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఒక సమావేశానికి హాజరై వెళ్లిపోయారు. 2024లో కురిసిన భారీవర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో తిష్టవేసిన సమస్యలు

- మండలంలోని కొత్తకండ్రిగ, పెద్దపాలేడు, ఆర్ అనంతాపురం, జీఎన్ కండ్రిగ, పూసలపల్లి, చిన్నయగుంట, జంబుగోళం, ఆలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, రెడ్డిగుంట బాడవ, గాజులపెళ్లూరు, గ్రామాలకు వెళ్లేరోడ్డు గుంతలమయమై ఉన్నాయి.
- బుచ్చినాయుడుకండ్రిగ నుంచి సూళ్లూరుపేటకు వెళ్లే మార్గం డబుల్ రోడ్డు కాకుండా ఉన్న సింగిల్ రోడ్డు గుంతలమయంగా మారింది.
- కంచనపుత్తూరు, వీయస్ పురం, బుచ్చినాయుడుకండ్రిగ గ్రామాల్లో ఓవరుహెడ్ తాగునీటి ట్యాంకులు లేవు.
- మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనులు అసంపూర్తిగా ఉన్నాయి.
- ఆలత్తూరు, చల్లమాంబపురం గ్రామాల్లోని క్వారీ, క్రషర్లతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొండలను తవ్వేస్తున్నా పట్టించుకోవడంలేదు.
- సచివాలయ సిబ్బంది, పలుశాఖల అధికారులు సమయపాలన పాటించడంలేదు
- ఉపాధి హామీ పథకంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో యంత్రాలతో పనులు చేయటంతో పక్కదారి పడుతుంది.
- ప్రభుత్వాస్పత్రిలో అదనపు గదులు లేకపోవడంతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు.
- పశువులకు వైద్యసేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి.
- జగనన్న కాలనీల్లోని పక్కాగృహాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి.
- తెలుగుగంగ స్లూయిజ్ కాలువ అసంపూర్తిగా ఉండటంతో చెరువులకు గంగనీరు చేరక పంటలు ఎండిపోతున్నాయి.
- మండలంలోని కాళంగినదిలోని ఇసుకను స్మగ్లర్లు యథేచ్ఛగా చెన్నైకు అక్రమ రవాణా చేస్తున్నారు.
- పింఛన్లకోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.
- కంచనపుత్తూరు, ఆలత్తూరు, ఆర్ అనంతాపురం, గ్రామాల్లోని సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తి కాకుండా అసంపూర్తిగా ఉన్నాయి.
- బుచ్చినాయుడుకండ్రిగలోని శ్మశానాన్ని పంచాయతీ సిబ్బంది గ్రామంలోని చెత్తా, చెదారంతో నింపేశారు.







భారీ వర్షాలకు దెబ్బతిన్న వరిపంట, బుచ్చినాయుడుకండ్రిగలోని ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న అదనపు గదుల నిర్మాణం, పద్మావతీపురంలో పడకేసిన పారిశుధ్యం

నూకతోటి పరామర్శ



అత్తిరాల పార్వతమ్మకు నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

కేవీబీ పురం: వైఎస్సార్ సీపీ నేత సురేష్ కుటుంబాన్ని బుధవారం సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. ఆ పార్టీ నాయకుడు అత్తిరాల సురేష్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ నేపథ్యంలో నూకతోటి రాజేష్ అంజూరు గ్రామంలోని అత్తిరాల పార్వతమ్మ ఇంటికి చేరుకుని ఆమె చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఆయనతోపాటు పార్టీ మండల అధ్యక్షులు గవర్ల కృష్ణయ్య, పార్టీ సీనియర్ నేతలు నందకుమార్, లాల్బాద్ యాదవ్, సర్పంచ్ గిరిబాబు, మణి, వెంకటరత్నం, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

వీఆర్‌ఓలు పనితీరు మార్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామ రెవెన్యూ అధికారుల పనితీరు బాగోలేదని, పనితీరు మార్చుకోక పోతే చర్యలు తప్పవని తహసీల్దారు శ్రీదేవి హెచ్చరించారు. ఆయన బుధవారం కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలపై వినతులను విచారించి పరిష్కరించడంలో వీఆర్‌ఓలు విఫలమయ్యారని చెప్పారు. పనితీరు మార్చుకోకపోతే కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ నల్లయ్య, మండల సర్వేయరు ప్రకాష్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

గంగమ్మా! చల్లంగ చూడమ్మా..



గంగమ్మకు మొక్కుతున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని బీపీ అగ్రహారం గంగమ్మ జాతరలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, గంగమ్మ తల్లి ఆశీస్సులు శ్రీకాళహస్తి ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు. అలాగే శ్రీకాళహస్తి చరిత్రలో మొట్టమొదటిసారిగా తమ ప్రభుత్వ హయాంలోనే శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం తరఫున గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పించడం మొదలెట్టినట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో రత్నం రెడ్డి, బుజ్జి మేస్త్రి, ఆర్.శంకర్, మున్నా రాయల్, లక్ష్మీపతిరెడ్డి, సెన్నీర్ కుప్పం శేఖర్, సుబ్రమణ్యం, మధురెడ్డి, జైకృష్ణారెడ్డి, వెంకట మునిరెడ్డి, కందయ్య, నాగేందర్ రెడ్డి, హరి ప్రసాద్, నాగార్జున్ గౌడ్, రవితేజ గౌడ్, జ్ఞాన ప్రసాద్, అభినయ్, మోహన్,ముని రామ్, ఉత్తరాజి శరవణ కుమార్, సిరాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం పల్లంపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. బాలల హక్కులు–చట్టాలు, పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు గురించి వివరించారు. కిశోర బాలికల్లో వచ్చే శారీరక మార్పులకు అనుగుణంగా సమతుల పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, సునీత, సుమతి, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ

కేవీబీ పురం: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల ఆవరణలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి బుధవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం భూమి పూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద 197 మందికి ఎంజాయ్‌మెంట్ పట్టాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

మంత్రికి సాదర స్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న అధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం బుధవారం తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి తిరుపతి జిల్లా ప్రజా రవాణాధికారి వెంకటరావు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథ్, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ బాలాజీ పుష్పగుచ్ఛం ఇచ్చి సాదర స్వాగతం పలికారు.

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత



ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

బుచ్చినాయుడుకండ్రిగ: పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎంపీడీఓ కార్యాలయ అవరణలో చెత్తా, చెదారాన్ని పారిశుధ్య కార్మికులచే తొలగించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. స్వచ్ఛతతోనే వ్యాధులు దూరమవుతాయని తెలిపారు. మొక్కలను నాటడం వలన పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓ త్రివిక్రమ్‌రావు, ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- ఆగ్రహం వ్యక్తం చేసిన డీపీఓ సుశీలాదేవి



ఆధార్ సీడింగ్ చేయకపోవడంపై కార్యదర్శులను ప్రశ్నిస్తున్న డీపీఓ సుశీలాదేవి

ఏర్పేడు (రేణిగుంట): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారిణి సుశీల దేవి హెచ్చరించారు. ఏర్పేడు మండల పరిషత్ కార్యాలయంలో ఆమె పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. స్వర్ణ పంచాయతీ యాప్‌లో ఆధార్ సీడింగ్ నమోదు చేయాలని మూడు నెలలుగా చెబుతున్నా మండలంలోని ఏర్పేడు, గుడిమల్లం, బండారుపల్లె, పాగాలిలో ఇప్పటి వరకు ఒక్కరి వివరాలు కూడా నమోదు చేయలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో చెత్త సేకరించాలని, ఎక్కడ పడితే అక్కడే పేడదిబ్బలు లేకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. కార్యదర్శులు సచివాలయాలకు సక్రమంగా రావడం లేదనే ఫిర్యాదులందుతున్నాయని, ఇకపై మీరెక్కడ బయోమెట్రిక్ వేస్తున్నారో మానిటరింగ్ చేసి సక్రమంగా రాని వారి జీతాలు కట్ చేస్తామన్నారు. మ్యుటేషన్లు పరిశీలనలో నిబంధనలను పాటించకుంటే విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆమందూరు ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ రమణకుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

బడి ఈడు దివ్యాంగ పిల్లల గుర్తింపు



నారాయణవనం: మండలంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో బడిఈడు దివ్యాంగ పిల్లలను గుర్తించి భవిత కేంద్రంలో చేర్పించడానికి సహిత విద్య ఉపాధ్యాయులు మండలంలో సర్వే ప్రారంభించారు. బుధవారం నారాయణవనం, తిరువట్యం పంచాయతీల్లో సర్వే చేశారు. సర్వేలో జిల్లా సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ప్రభుత్వం సాధారణ విద్యార్థులతోపాటు అన్ని సదుపాయాలు, సౌకర్యాలు కల్పిస్తున్నారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా జూన్ 9వ తేదీ వరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వేలో సహిత విద్య ఉపాధ్యాయులు విజయన్ భరత్ పాల్గొన్నారు.

సర్వభూపాలుడిపై కల్యాణ వెంకటేశ్వరుడు



నారాయణవనం: టీటీడీ అనుబంధ పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి సర్వభూపాల వాహనంపై, ఉదయం కల్పవృక్ష వాహనంపై ఊరేగారు. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొల్పి, తొలి గంటతో ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సుగంధ పుష్ప మాలికలను, స్వర్ణాభరణాలను స్వామి వారికి అలంకరించారు. సర్వాంగ సుందరంగా ముస్తాబైన స్వామివారు 8 గంటలకు కల్పవృక్ష వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, వేదమంత్రాలు, భక్త బృందాల కోలాటాలు, డప్పుల వాయిద్యాల మధ్య గోవింద నామస్మరణలతో స్వామి వారు ఊరేగారు. ఆలయానికి చేరుకున్న స్వామివారు ఉభయ నాంచారులతో స్నపన తిరుమంజనంలో సేద తీరారు. సాయంత్రం పట్టాభిషిక్తుడైన పద్మావతీ సమేత వేంకటేశ్వరుడు వేద, నాద గాత్ర కచ్చేరీల మధ్య ఊంజల్‌సేవలో తరించారు. రాత్రి 7.30 గంటలకు సుగంధ పుష్పాలతో అలంకరించిన సర్వభూపాల వాహనాన్ని అధిరోహించి భక్తులను కటాక్షించారు. కార్యక్రమాలను డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో హరి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ రామకృష్ణ పర్యవేక్షించారు. ఉత్సవాలలో భాగంగా గురువారం రాత్రి గరుత్మంతుడిపై కల్యాణ వెంకన్న ఊరేగనున్నారు.